క్లుప్తంగా

కళాకారిణి శ్రీదేవికి సత్కారం


శ్రీదేవిని సత్కరిస్తున్న అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్త సోమవారం ప్రదక్షిణల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి భక్తులు పాల్గొని స్వామివారికి అభిషేకాలు. అర్చనలు చేశారు. ఉదయం 7 గంటలకు అమలాపురానికి చెందిన గొలకోటి శ్రీదేవి భరతనాట్యం ప్రదర్శన చేశారు. ఆలయ అధికారులు శ్రీదేవిని ఘనంగా సత్కరించారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.వాసు తదితరులు పాల్గొన్నారు.

గణపతి మట్టి విగ్రహాల పంపిణీ


విగ్రహాలు పంపిణీ చేస్తున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే మట్టి గణపతులనే పూజించాలని పట్టణ సీఐ కె.రజనీకుమార్ తెలిపారు. గణపతి నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకుని సోమవారం పట్టణ యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండర్ పోకల రాము, క్లబ్ సభ్యులు ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షులు కానూరి ప్రభాకరరావు, సెక్రటరీ గుండుమోగుల వీరాస్వామి, మద్దాల వాసు, జక్కంపూడి కుమార్, కఠారి నాగేంద్ర, యర్రంశెట్టి వెంకటరత్నం, సంగినీడి రంగారావు, పశ్యావుల రవికుమార్, వినుకొండ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్షయ వ్యాధికి చికిత్స పొందుతున్న 20 మంది బాధితులకు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవలతో పాటు వాకర్స్ క్లబ్ వంటి సేవా సంస్థల ద్వారా ఎంతో మంది అనారోగ్య బాధితులకు కొంతైనా లబ్ధి చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వరప్రసాద్, క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు, సభ్యులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, మణిత్యాగి, చంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, జవ్వాజి కళ్యాణ్, నంబూరి గంగా పవన్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

పెనుగొండ: పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో రేషన్ స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, సర్పంచ్‌లు నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: పెనుమంట్రలో సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రేషన్ స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పంపిణీ చేశారు. మండలంలోని 32 చౌక డిపోలకు చెందిన 18470 పాత కార్డులను డిజిటల్ స్మార్ట్ కార్డులుగా తయారుచేసి లబ్ధిదారులకు అందజేశామని తహసీల్దార్ వై.రవికుమార్ తెలిపారు. ఎస్ ఇల్లిందలపర్రు సర్పంచ్ వనుము సూర్యనారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అజ్జమూరులో రేషన్ షాపు ఏర్పాటు చేయండి

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ శివారు గరువు ప్రాంతంలో రేషన్ ఇవ్వడం వల్ల రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 550కి పైగా రేషన్ కార్డులున్నాయని, వాటిలో 400 కార్డులు గ్రామంలోనే ఉన్నాయని, మిగిలినవి గ్రామ శివారు గరువు ప్రాంతంలో ఉన్నాయని చెబుతున్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తీసుకుని, మోసుకుని రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుందంటున్నారు. గ్రామానికి అందుబాటులో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని లేదా, గ్రామ దేవాలయం వద్ద రేషన్ బియ్యం సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చవితి వ్యాపారులకు పన్నుపోటు

- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- మునిసిపల్ గెజిట్‌లో లేకున్నా పన్నుల వసూలు
- వ్యాపారుల గగ్గోలు

పాలకొల్లు సెంట్రల్: హిందువుల ఆరాధ్యదైవం విఘ్నాలను తొలగించే అధినాయకుడు గణనాథుని చవితి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు ముందురోజు మంగళవారం పాలకొల్లు పట్టణంలో వ్యాపారులు రోడ్డుపై పువ్వులు, పత్రి, మట్టి వినాయకులు, పండ్లు, పాల వెల్లులు వంటి పూజా సామగ్రిని విక్రయిస్తుంటారు. వీరి నుంచి పన్నులు వసూలు చేయరాదని మునిసిపల్ గెజిట్‌లో 19వ పేజీలో 47వ షరతుతో ఉంది. ఐనా, చవితి సందర్భంగా ఒక్కరోజు పూజా సామగ్రిని విక్రయించే వ్యాపారుల నుంచి రూ.100 నుంచి రూ.300 వరకు ఆపై వసూలు చేస్తున్నారు. చిన్న వ్యాపారులైనా సరే పన్ను మినహాయింపు ఇవ్వడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ ఇష్టానుసారం పన్నులు వసూలు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడంలేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.


వాటికి రుసుములు వసూలు చేసుకొనే హక్కును మినహాయింపు చేయబడినది.
షర : సరుకుల ఖరీదులోను, అమ్మకములోను ఫలం మారినచో ప్రతీ స్థలమునకు ...
రేటు ప్రకారం చెల్లించవలెను.
పచ్చగడ్డి, మజ్జిగ, పిడకలు, తాటియాకులు, ..., వినాయక చవితి సందర్భంలో అమ్మకమునకు వచ్చు పువ్వులు, పత్రి, మట్టి వినాయక విగ్రహాలు, ...

చవితి సామగ్రికి పన్ను లేదన్న మునిసిపల్ గెజిట్ 19వ పేజీలో 47వ షరతు


మార్కెట్లో చవితి వ్యాపారుల సందడి (ఫైల్)

గతంలో ఇలా..

గతంలో ఇలా వినాయక చవితి పండుగలో పన్ను వసూలు చేయడంపై మీడియాలో వచ్చిన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. చవితి రోజు మార్కెట్లో వ్యాపారులకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని ప్రచారం చేయడంతోపాటు ఫ్లెక్సీలనూ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కూడా కాంట్రాక్టర్ల పన్ను వసూలు దందా నుంచి తమను రక్షించాలని వ్యాపారులు మునిసిపల్ అధికారులను కోరుతున్నారు. గెజిట్ నిబంధనలపై పట్టణంలో మైక్ ప్రచారం చేయాలని మునిసిపల్ అధికారులను హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మినహాయింపు ఇవ్వాలి



మునిసిపల్ గెజిట్ నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పన్నులు వసూలు చేస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలి. ఏడాదికి ఒక్కరోజు పండుగ పూట వ్యాపారం చేసుకునే వారి నుంచి పన్నులు వసూలు చేయడం దారుణం. చవితి రోజు వ్యాపారులకు పన్నులను మినహాయించాలి.

– గాదె వెంకన్న, ధర్మపరిరక్షణా సమితి అధ్యక్షుడు, పాలకొల్లు

కష్టాన్ని దోచేస్తే ఎలా?



వినాయక చవితికి పూజా సామగ్రి విక్రయాలు వల్ల మార్కెట్లో సందడి నెలకొంటుంది. ఎంతో శ్రమకోర్చి చెట్లు ఎక్కి ఆకులు, పండ్లు, పూలు కోసుకువచ్చి విక్రయిస్తుంటారు. వీరి కష్టాన్ని పన్నులు రూపంలో లాగేస్తే ఎలా. గెజిట్‌లోనే లేని పన్నులు ఎలా వసూలు చేస్తారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– సునీతాదేవి, విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు, పాలకొల్లు

ఎరువుల షాపులో తనిఖీ


ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలం పెనుమదం గ్రామంలోని అయ్యప్ప ఫెర్టిలైజర్స్ ఎరువుల షాపులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించారు. జిల్లాలో యూరియా 401 మెట్రిక్ టన్నులు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎటువంటి కొరత లేదన్నారు. డీలర్లు ఎంఆర్‌పీ ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పాలకొల్లు ఏడీఏ మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి విశ్వేశ్వరరావుర, ఎస్ కాశీవిశ్వనాతం, రైతులు పాల్గొన్నారు.

పాలు మృతికి సంతాపం


పాలు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీటీసీ పెద్దిరాజు, నాయకులు

పెనుగొండ: గుమ్ములూరు మాజీ సర్పంచ్ గొట్టుముక్కల పాలు మృతికి పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎనిమిదేళ్లపాటు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి పాలు చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి సుధాకర్, మాజీ ఎంపీటీసీ కుడిపూడి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు విప్పర్తి ప్రభాకర్, పైడి ఈశ్వరరావులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నరసాపురం: శెట్టిబలిజ సంక్షేమ సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం మొగల్తూరులో నిర్వహించిన సంఘ సమావేశంలో నరసాపురం పట్టణ అధ్యక్షుడిగా శీలబోయిన వెంకటేష్, మండల అధ్యక్షుడిగా కడలి సోంబాబు, మొగల్తూరు మండల అధ్యక్షుడిగా కుక్కల సత్యనారాయణ (పెద్దరాజు) ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో శెట్టిబలిజ సామాజికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతామని నూతన కమిటీ పేర్కొంది. సంఘ నాయకులు పాలా రాంబాబు, గుబ్బల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న లాజరు

యలమంచిలి: బూరుగుపల్లి గ్రామానికి చెందిన అగాపే చారిటబుల్ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం వీధుల్లో భిక్షం వేడుకుంటున్న బాలలు, వితంతువులకు ట్రస్ట్ తరఫున దైవజనులు పమ్మి లాజరు దుస్తులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో కొంతమేర సహాయం చేయడం ద్వారా భగవంతుని ఆశీస్సులు పొందవచ్చని ఆయన అన్నారు. ట్రస్ట్ కార్యదర్శి పమ్మి తాతాజీ, కోశాధికారి పమ్మి లీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న గణనాథులు

పెనుగొండ: చవితికి రెండు రోజులు ముందుగానే గణపతి ప్రతిమలు చలువ పందిళ్లకు తరలి వెళుతున్నాయి. చవితి ముందు రోజు మంగళవారం కావడంతో సోమవారం సాయంత్రం నుంచే గణపతి ప్రతిమలు పెనుగొండ నుంచి భారులు తీరాయి. ఖార్కానాల నుంచి చవితి నిర్వాహకులు బాణసంచా కాల్పులు, తీన్‌మార్ వాయిద్యాలతో తీసుకెళుతున్నారు. దీంతో పెనుగొండ వీధులు కిక్కిరిసి పోయాయి. మూడు నుంచి 15 అడుగుల ఎత్తు ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను ట్రాక్టర్లపై తీసుకెళుతున్నారు. వ్యయం అధికంగా ఉన్నా, ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలు వద్దంటూ ప్రచారం చేస్తున్నా వాటిపైనా ఉత్సవాల నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు.

పెరిగిన మట్టి విగ్రహాలు

కాగా, పెనుగొండలో మట్టి విగ్రహాల అమ్మకాలు జోరు పెరిగాయి. ఈ ఏడాది మట్టి విగ్రహాలపై విస్తృత ప్రచారం చేయడంతో అరడగు నుంచి నాలుగు అడుగుల వరకు తయారు చేసిన మట్టి విగ్రహాలు అమ్మకానికి రావడంతో ఇళ్లల్లోనూ, చిన్నారులు నిర్వహించే చవితి పందిళ్లకు మట్టి విగ్రహాలను కొనుగోలు చేశారు. ద్రాక్షారామం, సిద్ధాంతం వంటి గ్రామాల నుంచి మట్టి విగ్రహాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.


పెనుగొండ ఖర్కానా నుంచి కదలి వెళుతున్న భారీ వినాయక ప్రతిమ


చవితి పందిళ్లకు తరలి వెళుతున్న గణపతి ప్రతిమలు


పెనుగొండలో అమ్మకానికి మట్టి ప్రతిమలు

స్పందనకు 4 ఫిర్యాదులు

ఆకివీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(స్పందన)కు సోమవారం 4 ఫిర్యాదులు అందినట్లు తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. సిద్ధాపురం గ్రామంలో రీ సర్వేలో తగ్గిన వ్యవసాయ భూమిని సరిజేయాలని రైతు నంబూరి సోమరాజు ఫిర్యాదు చేశారన్నారు. స్థానిక జానకీనగర్‌లో దారి మార్గం లేకుండా స్థలం ఆక్రమించారని కారంకి జయలక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు. అందెవారి బోదె వద్ద ఏడుపులతో కూడిన ప్రార్థనలు చేస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఫిర్యాదు చేయగా, అజ్జమూరు గ్రామంలోని దేవస్థానం పాలక వర్గంలో అన్యమతస్తుడు బుంగా నరేష్‌ను ఆలయ ధర్మకర్తగా నియమించారని గ్రామానికి చెందిన వర్ధినేని లక్ష్మీ వరప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

కూటమి వైఫల్యాలపై ప్రచారం


నేరేడుమిల్లిలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

యలమంచిలి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పార్టీ పటిష్టానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు కోరారు. నేరేడుమిల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దీనిపై ప్రజలకు వివరించాలని అన్నారు. మోసపూరిత ప్రభుత్వంలో రైతులకు యూరియా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికలాంగ పింఛన్‌లో కోత పెట్టడం దారుణమన్నారు. పార్టీ గ్రామ, మండల, అనుబంధ కమిటీలపై చర్చించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి, పార్టీ సీనియర్ నాయకులు బోనం బులి వెంకన్న, పెన్మత్స బుజ్జిరాజు, జల్లి నాగేశ్వరరావు, గుడాల సురేష్, కళ్యాణం గంగాధరరావు, కుక్కల బాలచంద్రన్, నామన సుబ్బారావు, దూనబోయిన వెంకన్న, తాడి రత్నరాజు, మానుకొండ దేశంగిరాజు, పలివెలి రత్నరాజు, బొక్కా రంగారావు, కాలా బత్తుల నాగేశ్వరరావు, దండు గణేష్, కళాబత్తుల ఉదయ్ భాస్కర్, జల్లి శాంతారావు, గుండె మహేష్, పోల మూరి పవన్, బొక్కా లక్ష్మీనారాయణ, తాడి లాలూ ప్రసాద్, కంబాల శ్రీను, ఆకుమర్తి వెంకన్న, తాళ్లూరి రత్నరాజు, మల్లిపూడి పెద్దిరాజు, దాకే సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

నరసాపురం: వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగింపు ప్రక్రియ ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీఓ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన సదరం ధ్రువీకరణ పత్రం కలిగి ఉండి చాలాకాలంగా దివ్యాంగుల పింఛను తీసుకుంటున్న కొందరి పింఛన్లు ఇటీవల తొలగిస్తున్నట్టు నోటీసులు పంపడం దారుణమని అన్నారు. ప్రభుత్వం ఈ ప్రక్రియ కొనసాగిస్తే చాలామంది దివ్యాంగులు తమ పింఛన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దివ్యాంగుల పట్ల మానవత్వం చూపి వారి పింఛన్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మొత్తం 64 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పింఛన్లు తొలగించవద్దని కోరుతున్న పెద్దిరాజు

ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్‌కు అభినందనలు


కానిస్టేబుల్ ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎస్పీ

భీమవరం: హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 42.2 కిలోమీటర్ల మారథాన్ రన్ కార్యక్రమంలో ఫినిషర్ మెడల్ సాధించిన ఆర్మ్డ్ రిజర్వ్ కానిస్టేబుల్ ఎస్ వీఎస్ ప్రసాద్‌ను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ కేవలం 4 గంటల 19 నిమిషాల వ్యవధిలో రన్‌ను పూర్తి చేసి ఫినిషర్ మెడల్ సాధించిన ప్రసాద్ క్రమశిక్షణ, నిబద్ధత అందరికీ ఆదర్శనీయమన్నారు.

బాల్యవివాహాలు చేస్తే జైలు శిక్ష తప్పదు

భీమవరం: బాల్యవివాహాలకు పాల్పడితే జైలు శిక్షతోపాటు జరిమానా తప్పదని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి అన్నారు. సోమవారం భీమవరం డీఎన్నార్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బాల్య వివాహాల నిషేధంపై అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహం చేసినా, వివాహానికి హాజరైన వారందరూ నేరస్థులేనన్నారు. దీనికిగాను నేరం రుజువైతే రెండేళ్ల వరకూ జైలుశిక్ష, రూ.లక్ష వరకూ జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై యోహాన్, ప్యానల్ న్యాయవాదులు ఎన్ సుధీర్, పి.అంబేద్కర్, కె.జ్యోతి, మీడియేషన్ న్యాయవాది కె విజయలక్ష్మి, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, జిల్లా గిరిజన శాఖ అధికారిణి డి పుష్పరాణి, టూటౌన్ ఎస్సై రహమాన్, పారా లీగల్ వాలంటీర్లు కె చంద్రరావు, కె కాశేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ కె శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.


కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుధారాణి

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు



పోలీసు సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి

భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సాంకేతిక అప్లికేషన్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కంప్యూటర్ ఆపరేటింగ్ కానిస్టేబుళ్లు కృషి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి చెప్పారు. పోలీసు శాఖలో అమలుచేస్తున్న నూతన సాంకేతికత విధానాలపై క్షేత్ర స్థాయిలో సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటింగ్ కానిస్టేబుళ్లకు ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్, ఏపీ కమ్యూనిటీ పోలీసింగ్ సొల్యూషన్స్, ఇంటర్-ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, ఇంటిగ్రేటెడ్ రోడ్డు ఆక్సిడెంట్ డేటా బేస్, క్రైమ్ మల్టీ ఏజెన్సీ సెంటర్, ఈ సాక్ష్య వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రధానంగా సమాచార నమోదు సమయంలో ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తి సమాచారాన్ని ఏ విధంగా నమోదు చేయాలి వంటి పలు అంశాలపై సిబ్బందికి జిల్లా ఐటీ కోర్ టీం పూర్తి అవగాహన కల్పించింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలను మరింత ప్రభావవంతంగా, పారదర్శకంగా మార్చడానికి సాంకేతికత కీలకమని నూతన సాంకేతిక విధానాలను సరిగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన సేవలను అందించవచ్చునన్నారు. దీనివల్ల నేర నియంత్రణ మరింత సులభమవడమేగాక ప్రజలకు, పోలీసులకు మధ్య ఉన్న బంధం మరింత పటిష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, సైబర్ అండ్ సోషల్ మీడియా ఎస్సై రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీలతోపాటు పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి బలరామ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కేతా గోపాలన్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా సెక్రటేరియట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు ట్రూ ఆప్ చార్జీలు, మరోవైపు పెంచిన విద్యుత్ చార్జీలు వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే మరోవైపు ప్రజలపై విద్యుత్ భారాలను మోపడం అన్యాయమన్నారు. తక్షణం విద్యుత్ భారాలను తగ్గించకుంటే ఉద్యమాన్ని చేపడతామని బలరామ్ హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కౌరు పెద్దిరాజు, బి వాసుదేవరావు, చింతకాయల బాబురావు, పీవీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుప్పపట్టిన ప్రజాధనం

ఉండి: ప్రజాధనం తుప్పుపడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒకటిన్నర సెంట్లు ఇంటిస్థలం మంజూరు చేసి ఇల్లు కట్టుకునేందుకు రుణమిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇల్లు కట్టుకునేలా మెటీరియల్ ఇసుక, ఇటుక, ఐరన్ ఇలా ప్రభుత్వం నుంచి అందజేసి సహకరించారు. ఉండి, కాళ్ళ, ఆకివీడు మండలాల కొరకు ఉండి ఏఎంసీలో ఇళ్ల నిర్మాణం కొరకు ఐరన్‌ను భద్రపరచారు. ఇళ్లు కట్టుకునే వారికి ఇక్కడ నుండే మెటీరియల్‌ను అధికారులు అందజేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే సీన్ ఒక్కసారిగా రివర్స్ అయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా నిర్మాణం కాలేదు. నిరుపేదలు, కూటమి ప్రభుత్వం ఇంటి రుణాలు మంజూరు చేస్తుందని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. దీంతో ఇంటి నిర్మాణాల కోసం నిలువ ఉంచిన ఐరన్ తుప్పుపట్టిపోతోంది. లక్షలు విలువ చేసే ఐరన్‌ను ఇలా గాలికి వదిలేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ఉండి ఏఎంసీలో తుప్పపట్టిన ఐరన్